

కంది రైతుకు కన్నీరు!

చీకలగురికి వద్ద కుళ్లిపోయిన కంది పంట



భారీ వర్షాలకు కుళ్లిన పంట

రూ.లక్షల్లో నష్టపోయిన అన్నదాతలు

పంటను తొలగించి.. ప్రత్యామ్నాయానికి ఏర్పాట్లు

విడపనకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు కంది పంట సర్వనాశనమైంది. మూడు నెలలపాటు కంటికి రెప్పలా కాపాడుకున్న పంట రైతులను నష్టాలపాలు చేసింది. ఉరవకొండ నియోజకవర్గంలో జూలై నెలలో కంది సాగు ప్రారంభించారు. కొన్ని రోజులు వర్షాలు రాకపోవటంతో మొలక దశలోనే పంట ఎండిపోతుందని ఆందోళన చెందారు. ఆగస్టు నుంచి క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తుండటంతో భూమిలో తేమ ఆరనేలేదు. మిట్ట ప్రాంతాల్లో పంట బాగానే ఉన్నా, లోతట్టు ప్రాంతాల్లో మొత్తం కుళ్లిపోయింది. మాళాపురం, పెద్ద కొట్టాలపల్లి గ్రామాల వద్ద కంది పొలాల్లో ఇప్పటికీ మోకాలు లోతు వర్షపు నీరు ఉంది. ఆ నీరు బయటకు పోతేనే పంటలు కోలుకుంటాయి. లేక పోతే కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంటను తొలగిస్తున్న రైతులు

తట్రకల్లు రైతులు కంది పంటను తొలగిస్తున్నారు. పొలంలో నీరు నిలవడంతో ఇప్పటికే ఓ రైతు 5 ఎకరాలలో కంది పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడు. కొనకొండ్ల వద్ద కొందరు రైతులు పొలాల్లో నిలిచిన నీటిని వంకలకు మళ్లించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఉరవకొండ డివిజన్‌లో వందల ఎకరాల్లో కంది పంట కుళ్లిపోయింది. రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంట విత్తనాన్ని ఉచితంగా ఇచ్చి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



పొలంలో కుప్పలుగా వేసిన కుళ్లిన కంది మొక్కలు



కంది పంటలో నిలిచిన వర్షపు నీరు



రూ.లక్ష నష్టం

వజ్రకరూరు మండలం రాగులపాడు రైతు కురుబ నాగేంద్ర నాలుగు ఎకరాల్లో కంది పంటను సాగు చేశాడు. ఎడతెరపి లేని వర్షాలకు ఇప్పటికే ఎకరం పొలంలో పంట పూర్తిగా కుళ్లిపోయింది. మిగిలిన మూడు ఎకరాల్లో అక్కడక్కడ కుళ్లిపోతోంది. పప్పుశనగ సాగు చేసే సమయం వరకూ వేచి చూస్తానని, ఆ తరువాత కుళ్లిన పంటను తొలగించి పప్పుశనగ, ఉలువ పంటలను సాగు చేసుకుంటానని బాధిత రైతు తెలిపారు. కంది పంట కుళ్లిపోవడంతో రూ.లక్ష వరకూ నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విన్నవించారు.



ఏమీ మిగల్లేదు..

విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామానికి చెందిన చంద్రమోహన్ 25 ఎకరాల సొంత పొలం, 20 ఎకరాల కౌలు పొలంలో కంది పంటను జూలైలో సాగు చేశాడు. ఆగస్టులో భారీ వర్షాలు కురవడంతో పొలంలో నీరు నిలిచి పంట కుళ్లిపోవడం మొదలైయింది. అయినా ఎండలు కాస్తే అంతో ఇంతో మిగులుందని భావించాడు. కానీ ఈనెలలో మరోమారు భారీ వర్షాలు కురవడంతో ఆశలు వదిలేయాల్సి వచ్చింది. కుళ్లిన పైరును పొలంలోనే వదిలేసి, ప్రత్యామ్నాయ పంట సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఇప్పటికే పది ఎకరాల్లో కంది పైరు పూర్తిగా కుళ్లిపోయింది. రూ.5 లక్షలకు పైగా నష్టపోయాడు. మిగిలిన పంట పరిస్థితి దారుణంగానే ఉంది.

అభివృద్ధి పథంలో నడిపిస్తా

● కొత్త కలెక్టర్ ఆనంద్ ● బాధ్యతల స్వీకరణ.. అధికారులతో సమీక్ష



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా ఓ.ఆనంద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో పనిచేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్ బాపట్ల జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. కొత్త కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల స్వాగతం పలికారు. కలెక్టర్ చాంబర్‌కు చేరుకున్న ఆనంద్, దేవుని చిత్రపటానికి నమస్కరించి, బాధ్యతలు స్వీకరించారు. పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పెన్నహోబిళం లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు కలెక్టర్‌ను ఆశీర్వదించారు. ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, వసంత లత, వివిధ శాఖల అధికారులు కొత్త కలెక్టర్‌ను కలిసి, పూల మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సంతోషంగా ఉంది..

అధికారులను సమన్వయం చేసుకుని, జిల్లాను అభివృద్ధి దిశగా మరింత ముందుకు తీసుకువెళతానని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఇక్కడ రకరకాల సవాళ్లు ఉన్నాయని అన్నారు. కొంతవరకు నీటి సమస్య ఉందని అన్నారు. హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్ పరంగా ప్రగతి ఉందని, అన్ని విషయాలను అర్థం చేసుకుని జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. రాయలసీమ జిల్లాలో మొదటిసారి పనిచేస్తున్నానని తెలిపారు.

అందరూ సహకరించాలి..

జిల్లా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ నేపథ్యంలో శాఖలవారీగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన సమస్యలుంటే తెలియజేయాలని సూచించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళితే తప్ప పరిష్కారం లభించదని భావించే సమస్యలను మాత్రమే తెలపాలని సూచించారు. జిల్లాలో యూరియా డిమాండ్, నిల్వలు, పంపిణీ, పంటల సాగు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సత్యసాయి తాగునీటి పథకం సమస్యల గురించి ఆరా తీశారు. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తామని, అనంతరం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల గురించి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వీటికి సంబంధించిన నోట్స్ శనివారంలోపు తయారుచేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

నేడు విజయవాడకు కలెక్టర్

కలెక్టర్ ఆనంద్ ఆదివారం విజయవాడకు వెళ్లనున్నారు. ఈ నెల 15, 16తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. అందులో పాల్గొని, 17వ తేదీ జిల్లాకు తిరిగి వస్తారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటం

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని



మహాసభల్లో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని

అనంతపురం టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు కొనసాగిద్దామని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సభకు మాలిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి జెండా ఎగురవేసి సభను ప్రారంభించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వరలక్ష్మి, నాగమణి సంయుక్తంగా సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాలిని మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని అన్నారు. పిల్లలకు 30, 40 సంవత్సరాలుగా భోజనం వండిపెడుతున్నా ఎలాంటి గుర్తింపు, భరోసా లేదని అన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా వేధింపులు, తొలగింపులను కార్మికులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ కనీస వేతనం రూ.700 ఇవ్వాల్సి ఉందని, కానీ తక్కువ వేతనంతోనే సరిపెడుతున్నారని అన్నారు. ప్రసూతి సెలవులు కూడా ఇవ్వడం లేదని అన్నారు. అనారోగ్యానికి గురై ఆస్పత్రికి వెళితే, కార్మికులే ఇతరులను ఏర్పాటు చేసి వెళ్లాల్సి వస్తోందని, లేకుంటే రాజీనామా చేయాల్సి వస్తోందని అన్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లినా రోజుకు రూ.200 నుంచి రూ.300 వేతనం ఇస్తారని, కానీ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు కేవలం రూ.3 వేలు ఇస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు (మిగతా 6లో..)

థ్యాంక్యూ సీఎం సార్..!

వాహనమిత్ర ప్రకటనపై ఆటో డ్రైవర్ల హర్షం

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకం కింద రూ.15 వేలు అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల ఆటోడ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ... నగరంలో యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్‌కు కలెక్టరేట్ వద్ద ఆటో డ్రైవర్లు వినతిపత్రం ఇచ్చి, ఆదుకోవాలని కోరారని గుర్తుచేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆదుకుంటామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఆ మేరకు నాలుగు రోజుల కిందట సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభకు వచ్చిన చంద్రబాబు దసరాకు వాహన మిత్ర కింద రూ.15 వేలు ఆటో డ్రైవర్లకు ఇస్తామని అనంతపురంలోనే ప్రకటించడంతో ఆ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో జగన్ రూ.10 వేలు కుడిచేత్తో ఇచ్చి.. లిక్కర్, డీజిల్, పెట్రోల్ రూపంలో ఎడమ చేత్తో లాక్కున్నారన్నారు. వైసీపీ పాలనలో పోలీసులు, ఆర్టీఏ అధికారులు డ్రైవింగ్ లైసెన్సు లేదనీ, రికార్డులు సక్రమంగా లేవంటూ ఆటో డ్రైవర్లపై కేసులు బనాయించి అనేక ఇబ్బందులు పెట్టారన్నారు. కూటమి అధికారంలోకి రావడంతో ఆటోడ్రైవర్లకు ఆ బాధలు తప్పాయన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేషులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పీఎల్ఎన్ మూర్తి, ఆటో డ్రైవర్లు శత్రు, రాజు, ఖాసీం, సోము, శ్రీరాములు, చాంద్, షేక్షావలి, గోపి, మురళి పాల్గొన్నారు.

డీఎస్సీ ఎంపిక 6

జాబితా వచ్చేసిందోచ్..

● 773 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక ● మిగిలిపోయిన 34 పోస్టులు

ఇద్దరికి నామినేటెడ్ పోస్టులు



రంగాచారి (ఫైల్)

అనంతపురం క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరికి నామినేటెడ్ పదవులు లభించాయి. ఏపీ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కె.రంగాచారిని ప్రభుత్వం నియమించింది. ఆయన తెలుగుదేశం పార్టీలో ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. అనంతపురం నగరపాలక సంస్థ కార్పొరేటర్‌గా సేవలందించారు. టీడీపీ స్వర్ణకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. పార్టీకి ఆయన అందించిన సేవలు గుర్తించి డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చారు. ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా చల్లా లక్ష్మీప్రసాద్‌ను నియమించారు.

గడేకల్లులో విష జ్వరాలు

● ఒకే ఇంట్లో ముగ్గురికి డెంగీ

● బళ్లారి ఆసుపత్రికి తరలింపు



బళ్లారి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిఖిల్, తరుణ్

విడపనకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గడేకల్లు గ్రామంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇంటింటా జ్వరపీడితులు ఉన్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలబారిన పడిన పలువురు ఆస్పత్రులలో చేరి చికిత్స పొందుతున్నారు. ఒకే ఇంట్లో ముగ్గురు చిన్నారులు డెంగీ బారిన పడ్డారు. బాధిత చిన్నారులు నిఖిల్, తరుణ్, సుప్రియను వారి తల్లిదండ్రులు బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స చేయిస్తున్నారు. వైద్యానికి లక్షలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయని, స్థానిక వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన పలువురు గుంతకల్లు, ఉరవకొండ, బళ్లారి, అనంతపురంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి, గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాడు-నేడు అవస్థలే..!

● రూ.లక్షలు వెచ్చించినా మారని పాఠశాలల రూపురేఖలు ● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



శింగనమల ఎస్సీ పాఠశాలలో ఊడిన పైకప్పు పెచ్చులు



ఎస్సీ పాఠశాలల్లోనే ఉన్న సిమెంట్ ఇటుకలు

శింగనమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన నాడు-నేడు పనులు ఆగిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో వైసీపీ పాలనలో రెండు విడతల్లో నాడు- నేడు కింద పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. శింగనమల జడ్పీ హైస్కూల్‌కు రూ.1.98 కోట్లు మంజూరు చేశారు. మొదటి విడతలో 16 పాఠశాలలకు రూ.3.19కోట్లు, రెండో విడతలో 29 పాఠశాలకు రూ.8.57 కోట్లు నిధులు మంజూరు చేశారు. మొదటి విడతలో పాఠశాలలో 80 శాతం పనులు పూర్తి కాగా రెండో విడతలో 54 శాతమే పనులు పూర్తయ్యాయి. పాఠశాలలో ముగురుదొడ్లు ఏర్పాటు చేయలేదు. గదుల్లో బండలు వేయలేదు. పాఠశాలలో పనుల కోసం కొనుగోలు చేసిన కంకర కడ్డీలు ఆరుబయటే దర్శనమిస్తున్నాయి. వేలాది సిమెంట్ బస్తాలు గడ్డ కట్టినట్లు సమాచారం. చాలా పాఠశాలల్లో పనులు నాశిరకంగా చేయడంతో అప్పుడే పైకప్పు పెచ్చులూడిపడుతున్నాయి.



ఆగిపోయిన వంటశాల భవన నిర్మాణం

నాసిరకంగా ఫ్లోరింగ్

శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలకు వైసీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి ప్రత్యేక నిధులు విడుదల చేయించారు. నాడు- నేడు కింద నాబార్డు ద్వారా రూ.1.98 కోట్లు తీసుకుని వచ్చి పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్లు మాత్రం 11 గదులకుపైన కింద నాసిరకం ఫ్లోరింగ్ పూర్తిచేశారు. గోడలకు ప్లాస్టింగ్ చేశారు. పాఠశాల ఆవరణలో సిమెంట్‌తో ఫ్లోరిం గ్, గేట్, భవనాలకు రంగులు వేసి రూ.1.98 కోట్ల నిధులకు బిల్లు చేసుకున్నారు. అప్పుడే భవనాల పైపెచ్చులు ఊడిపడటంతో దాదాపు 8 గదుల్లో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

పనులు చేస్తాం

పాఠశాలలో నాడు-నేడు పథకం కింద చేపట్టిన పనులు ఆగిపోయిన విషయం వాస్తవమే. పాఠశాలలో అర్థాంతరంగా ఆగిపోయిన పనులను పునఃప్రారంభిస్తాం. ప్రభుత్వం నుంచి పనులు చేయమని ఆదేశాలు, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

- నరసింహరాజు, ఎంఈఓ

కొనసాగిన వాన

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షం కొనసాగింది. అనంతపురం నగరంలో మోస్తరు వర్షం కురిసింది. రాయదుర్గం, కణేకల్లు, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, కుందుర్పి, కంబదూరు, బెళుగుప్ప, శెట్టూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 5 మండలాల్లో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. బుక్కరాయసముద్రం మండలంలో 1.92 సెం.మీ. వర్షపాతం నమోదైంది. గుంతకల్లులో 0.52, కుందుర్పిలో 0.42, వజ్రకరూరులో 0.40, యాడికిలో 0.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

రేపు ఓపెన్ డే

అనంతపురం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంజనీర్స్‌డేను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థుల కోసం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 15న ఉదయం 9 గంటలకు ఓపెన్ డే నిర్వహిస్తున్నామని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి శనివారం తెలిపారు. వీసీ ప్రొఫెసర్ సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను అన్వేషించడానికి, ప్రత్యక్ష ప్రదర్శలను చూడటానికి, ఇంజనీరింగ్‌లో వివిధ శాఖల అనుభవాలను తెలుసుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. యువ మనస్సులను ప్రేరేపించడం, భవిష్యత్తు ఆవిష్కర్తలు, దేశ నిర్మాతలను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గిజిగాడు.. విలవిలలాడు..!

మట్టి మిద్దెలు మాయమాయె
తాటాకు కొట్టాలు తరిగిపాయె
కాంక్రీటు అడవిలో గిజిగాడు
గూడు కట్టలేక విలవిలలాడె..!

ప్రకృతి విరుద్ధ ఏర్పాట్లు
ప్రాణాలు తీసేస్తుంటే..
పాపం.. గువ్వ పిట్టలు..
గుండెలవిసేలా రోధించె..!

పాత రోజులే బాగుండె..
ప్రాణాలకు ఏ లోటూ లేకుండె..!











(బుక్కరాయసముద్రం బస్టాప్‌లో గువ్వల ఆవాసం కోసం ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ చెంబులు, వాటికి కట్టిన దారాలు ప్రాణాంతకంగా మారాయి. ఆ చెంబులలో గూడు కట్టుకున్న గువ్వల కాళ్లకు దారాలు చుట్టుకుని బంధిస్తున్నాయి. విలవిలలాడుతూ, ఆకలి దప్పులతో ప్రాణాలను విడుస్తున్నాయి..)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, అనంతపురం

అందుబాటులో 4,454 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం 4,454 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలు రైతు సేవాకేంద్రాల్లో 343, ప్రైవేటు డీలర్ల వద్ద 582, సొసైటీల్లో 111, హోల్‌సేల్ డీలర్లు, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద 1,710, కంపెనీ గోదాముల్లో 889, రవాణాలో 819 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. రెండు రోజుల్లో 1,470 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వస్తుందన్నారు.

టమోటా కిలో రూ.19

అనంతపురంరూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.17తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠధర రూ.8, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3150టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

రేపు స్పాట్ కౌన్సెలింగ్

రామగిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి ఈనెల 15వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారితోపాటు చేసుకోనివారు కూడా నేరుగా హాజరు కావచ్చన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు, ఇంటర్మీడియట్ ఫెయిలైన వారు అర్హులన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు రామగిరి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఆస్పత్రుల ధన దాహం..!

- అనవసర పరీక్షలు, మందులతో నిలువు దోపిడీ
- అడ్మిట్ కావాల్సిందేనంటూ హుకుం
- చేరితే చుక్కలు.. వేల రూపాయలు గుంజుతున్న వైనం
- పర్యవేక్షణ పట్టని వైద్య శాఖాధికారులు



ప్రైవేటు ఆస్పత్రిలో ఓపీకోసం నిరీక్షిస్తున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు



ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డెంగీ పరీక్షలు చేసిన ప్రైవేట్ హాస్పటల్

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికెళ్లాలంటేనే జనాలు హడలిపోతున్నారు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు నిలువు దోపిడీ చేస్తున్నాయన్నది బహిరంగ రహస్యమే. చిన్న సమస్యకు కన్సల్టేషన్ కోసమని వెళితే అనవసర పరీక్షలన్నీ చేసి.. అడ్మిట్ కావాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. పరిస్థితి ఇబ్బంది కరంగా ఉందనీ, అడ్మిట్ కాకపోతే తామేమీ చేయలేమంటూ బెదిరిస్తున్నారు. వారి బుట్టలో పడి అడ్మిట్ అయితే ఇక.. చుక్కలే. రోజులపాటు అడ్మిషన్‌లో ఉండాల్సిందే. వేలకువేలు గుంజుతారు. ఆరోగ్యం బాగు పడందనీ, డిశ్చార్జి చేయాలని అడిగినా ఒప్పుకోరు. మరికొన్ని రోజులు ఉండాల్సిందేనంటారు. 'డాక్టర్ నేనా.. మీరా' అంటూ.. కసురుకుంటారు. కొందరైతే గొడవపడి డిశ్చార్జి చేయించుకుని వెళ్లాల్సి వస్తోంది. అప్పటికీ ఇంటికెళ్లాక ఏమైనా అయితే తమకు సంబంధం లేదంటూ భయపెడుతున్నారు. వారి తీరుతో జనం బెంబేలెత్తిపోతున్నారు. పర్యవేక్షించాల్సిన వైద్య శాఖాధికారులు తమకు సంబంధమే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

కనీసం రూ.30వేలు

కాలానుగుణ వ్యాధులు ముసురు కోవడంతో చిన్నారులు మంచాన పడుతున్నారు. దీనిని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఆసరాగా తీసుకుంటున్నాయి. డాక్టర్‌తో చూపించుకుని తిరిగి ఇంటికి వస్తామని వెళ్తే ఆస్పత్రిలోనే చేరిపోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. రక్త పరీక్షలు, స్కానింగ్‌లు రాస్తున్నారు. వాటి ఫలితాలను చూపి అడ్మిట్ అవ్వాలని చెబుతారు. లేకపోతే ఇబ్బంది పడతారని భయపెడతారు. అనవసరమైన పరీక్షలు, మందులు రాస్తున్నారని బాధితులు వాపోతున్నారు. అడ్మిట్ అయితే రోజుకు రూ.4వేల నుంచి 8వేల వరకు బెడ్‌ఫీజు, ట్రీట్‌మెంట్ పేరుతో మరో రూ.వెయి నుంచి రూ.2వేల వరకు గుంజుతున్నారు. ఇలా డిస్‌చార్జ్ అయ్యేలోపు కనీసం రూ.30వేల నుంచి రూ.లక్ష వరకు లాగేసుకుంటున్నారని బాధితులు మండిపడుతున్నారు.

వైద్యశాఖ నిర్లక్ష్యం

గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వేలాదిమంది అధికారులు, డాక్టర్లు, నర్సులు, సిబ్బంది పనిచేస్తున్నారు. డీఎంహెచ్ఓ పరిధిలో 45 ప్రాథమిక, 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలతోపాటు 433 ఆరోగ్య ఉపకేంద్రాలున్నాయి. బోలెడంత నెట్‌వర్క్ ఉంది. ఇంటిపక్కన ఆశా వర్కర్ నుంచి గ్రామంలోని సచివాలయ ఏఎన్ఎం, ఆరోగ్య ఉపకేంద్రంలోని సిబ్బంది వరకు పనిచేస్తున్నారు. ఏ ఇంటిలో జ్వరం వచ్చినా తెలుసుకునే వెసులుబాటు ఆరోగ్యశాఖ సిబ్బందికి ఉంది. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నిర్లక్ష్యం నిండుకోవడంతో పేద ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాలను ప్రైవేటు ఆస్పత్రులు తుంగలో తొక్కుతున్నా.. పట్టించుకునేవారు లేరు.

రూ.20వేలు ఖర్చయింది: తిమ్మక్క, కళ్యాణదుర్గం



నెలల పాపకు జ్వరం, దగ్గువచ్చింది. ప్రైవేటు ఆస్పత్రికెళ్తే పరీక్షలు చేసి, టానిక్‌లు రాసిచ్చారు. వాటిని తాపినా తగ్గడంలేదు. రెండు వారాలపాటు డాక్టర్‌తో చూపించుకున్నాం. రూ.20వేల వరకు ఖర్చయింది. అయినా తగ్గకపోవడంతో పెద్దాస్పత్రిలో చేర్పించాం. ఇప్పుడు కోలుకుంటోంది.



కిటకిటలాడుతున్న పెద్దాస్పత్రిలోని చిన్నారుల వార్డు

అను'మతిలేని' పరీక్షలు..

ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కొన్ని పరీక్షలనే ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయాలి. వాటికి ఆస్పత్రులు తిలోదకాలిస్తున్నాయి. డెంగీ పరీక్షలు నిర్వహిస్తుండడమే ఇందుకు నిదర్శనం. ఎలిషా పద్ధతిలో డెంగీ పరీక్ష చేసే అవకాశం ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే ఉంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో అక్రమంగా నిర్వహిస్తున్నారు.

రూ.10వేలు పెట్టినా తగ్గలేదు..: రేణుక, ముదిగుబ్బ



మా పాప బడి నుంచి సాయంత్రం రాగానే జ్వరం వచ్చింది. ఆ రాత్రికి మాత్రవేశాం. పొద్దున్నే ప్రైవేటు డాక్టర్ దగ్గరకు వెళ్లాం. రక్తపరీక్షలు చేసి కొన్ని మాత్రలు, టానిక్‌లు ఇచ్చారు. మూడురోజుల వాడినా మార్పులేదు. దీంతో మళ్లీ వెళ్లి డాక్టర్‌కు చూపించాం. అప్పటికే రూ.10వేలు ఖర్చయింది. తగ్గకపోవడంతో పెద్దాస్పత్రిలో చేర్పించాం.

డబ్బులు పోయాల్సిందే..: రామాంజనేయులు దంపతులు, అనంతపురం



పిల్లలకు బాగోలేదంటే ప్రైవేటు ఆస్పత్రులకు డబ్బులు పోయాల్సిందే. ఒక్కో ఆస్పత్రిలో ఒక్కోరేటు ఓపీ ఉంటుంది. రక్తపరీక్షలు, స్కానింగ్‌లు రాస్తారు. మందులు ఖరీదైనవి ఇస్తున్నారు. వారానికిగాను రూ.25వేలు ప్రైవేట్ ఆస్పత్రిలో ఖర్చు చేశాం. ఆఖరుకు పెద్దాస్పత్రిలో చూపిస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల దందాను ప్రభుత్వం అరికట్టాలి.

చివరగా పంపుతున్నారు..



వాతావరణ మార్పుల కారణంగా చిన్నారులకు జ్వరం, దగ్గు, జలుబు లాంటివి సోకుతున్నాయి. చాలామంది పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు. వారిని పరీక్షించి, అవసరమైన చికిత్సలు అందించాలి. కొన్ని రోజులపాటు వైద్యం చేసి, జబ్బు తీవ్రమైన తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి పంపుతున్నారు. మొదట్లోనే రెఫర్ చేస్తే ఇబ్బందులు ఉండవు.

- ప్రొఫెసర్ రవికుమార్, చిన్నపిల్లల విభాగాధిపతి, సర్వజన వైద్యశాల

నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేస్తాం



నిబంధనలను విస్మరించి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రలను సీజ్ చేస్తాం. ధరల పట్టికలను ఆస్పత్రుల్లో ప్రదర్శించాలి. అవసరమైన మేరకే పరీక్షలు, స్కానింగ్‌లు చేయాలి. డెంగీ తదితర అనుమతి లేని పరీక్షలు చేయకూడదు. వ్యాధిని నయం చేయగలమని నిర్ధారణకు వచ్చినపుడే అడ్మిషన్ చేసుకోవాలి. జబ్బు తీవ్రమైన తరువాత ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేసి, చేతులు దులుపుకున్నట్లు తెలిస్తే సంబంధిత డాక్టర్ రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయిస్తాం.

- డాక్టర్ ఈబీ దేవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి

డీఎస్సీ ఎంపిక జాబితా వచ్చేసిందోచ్..

773 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

మిగిలిపోయిన 34 పోస్టులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల ఎదురుచూపులకు తెరపడింది. ఎట్టకేలకు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఎస్సీ-2025 అర్హత అభ్యర్థులను రోస్టర్, మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారు. 15 రోజులుగా ఈ ప్రక్రియ అటు అధికారులు, ఇటు అభ్యర్థుల్లో ఉత్కంఠరేపుతూ వచ్చింది. చివరకు ఎంపిక జాబితాను సిద్ధం చేసి, జిల్లా కమిటీ ఆమోదం కోసం రాష్ట్రశాఖ పంపించింది. జిల్లాలో 807 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. దాదాపు 45వేల మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 773 పోస్టులకు మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేశారు. వెరిఫికేషన్‌కు 776 మంది జాబితా రాగా.. ముగ్గురు అభ్యర్థుల సర్టిఫికెట్లు సరిగా లేకపోవడంతో తిరస్కరించారు. ఇక మిగిలిన 34 పోస్టులకు అభ్యర్థులు లేక మిగిలిపోయినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఇవి కూడా ఉర్దూమీడియం, బ్యాక్‌లాగ్ పోస్టులు అని అంటున్నారు. ఎంపిక జాబితాకు జిల్లా సెలెక్షన్ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అందులో భాగంగా రాష్ట్రశాఖ శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబుకు జాబితాను పంపించింది. తొలుత జిల్లా కార్యాలయంలో మరోసారి పరిశీలన చేయించారు. రోస్టర్ మేరకు ఏయే సబ్జెక్టుల్లో ఎన్ని పోస్టులు ఉన్నాయి, ఆ మేరకు ఉన్నాయా.. లేదా.. అని సరిచూశారు. అనంతరం జాబితాకు ఆమోదం వేయించుకోవడానికి నూతన కలెక్టరు ఆనంద్ వద్దకు డీఈఓ ప్రసాద్ బాబు శనివారం రాత్రి తీసుకెళ్లారు. అక్కడ సంబంధిత శాఖాధికారులతో నూతన కలెక్టర్ పక్కాగా పరిశీలించి వివరాలు ఆరా తీసిన తర్వాత జాబితాకు ఆమోదం వేసినట్లు సమాచారం. మొత్తంమీద జిల్లా డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక జాబితా ఓకే అయింది. 15న అధికారికంగా ప్రకటించనున్నారు. ఆ తర్వాత అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు.



డీఎస్సీ ఎంపిక జాబితాను కలెక్టర్ వద్దకు తీసుకెళ్తున్న డీఈఓ

హక్కుల సాధనకు ఐక్య పోరాటం

(5వ పేజీ తరువాయి)

అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కారణంగానే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని అన్నారు. అంత కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు పనిభద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. మోదీ ప్రభుత్వం ఎన్‌పీఏ విధానం అమలు చేయడంతో ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు పెరిగిపోయాయని, ప్రభుత్వ బడులు మూతపడుతున్నాయని అన్నారు. హక్కుల సాధనకు పోరాటాలే మార్గమని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించరాదని, మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం జనవరి నుంచి ఉద్యమాలకు సిద్ధమవుతామని ప్రకటించారు. మూడు సంవత్సరాలుగా యూనియన్ చేపట్టిన కార్యక్రమాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి వివరించారు. భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, నాయకుడు మురళి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ కోశాధికారి సుప్రజ, ఆఫీస్ బేరర్లు మహాలక్ష్మి, సుధా, శివకుమారి, విజయమ్మ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ జెండాను ఆవిష్కరించి మహాసభలు ప్రారంభిస్తున్న దృశ్యం



మొబైల్ వ్యసనం బారిన కుటుంబం

- కార్టూన్ల లోకంలో పిల్లలు
- రీల్స్ పిచ్చిలో యువత
- సోషల్ మీడియాలో పెద్దలు
- ప్రమాదంలో పిల్లల భవిష్యత్తు



బానిసెల్..!

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): 20 ఏళ్ల క్రితం సెల్‌ఫోన్ అంటే కేవలం మాట్లాడుకునే సాధనం. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ అంటే ఓ ప్రపంచమే. అన్నీ అందులోనే. దానికి అన్ని వయసుల వారు బానిసలవుతున్నారు. ఒకప్పుడు పిల్లలు సాయంత్రం పాఠశాల నుంచి వచ్చాక ఇంటి సమీపంలోని ఖాళీస్థలాలు, మైదానాల్లో ఆటలతో కాలక్షేపం చేసేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. స్మార్ట్‌ఫోన్ లేకుండా పిల్లలు ఐదు నిముషాలు కూడా నిశ్చలంగా కూర్చోలేకపోతున్నారు. పిల్లలు కార్టూన్లు, యూట్యూబ్ చానల్ వీడియోలకే పరిమితవుతున్నారు. 10-12 ఏళ్లకే పబ్జీ, ఫ్రీఫైర్, బీజీఎంఐ లాంటి గేమ్స్ పట్ల ఆకర్షితులవుతున్నారు. తల్లితండ్రులు కూడా పిల్లలను శాంతింపజేయడానికి ఫోన్ ఇచ్చేస్తున్నారు. ఆదే ఆ తర్వాత పెద్ద వ్యసనంగా మారి సమస్యలను తెచ్చి పెడుతోంది.

రీల్స్ పిచ్చిలో యువత..

యువతకు సోషల్ మీడియా అంటే ఒక కలల లోకం. ప్రతిక్షణం రీల్స్ తీయడం, లైక్‌ల కోసం ఆత్రతగా చూడడం, ఫాలోవర్స్ పెంచుకోవడాన్ని సీరియస్‌గా తీసుకుంటుంటారు. దాని వెనుక ఎన్నో ప్రమాదాలున్నాయనే సంగతే మరిచిపోతున్నారు. ఈ వ్యసనం.. ముఖంగా చదువుపై తీవ్రప్రభావం చూపుతోంది. ఒక్కో విద్యార్థి సగటున రోజులో 4 నుంచి 6 గంటలు మొబైల్‌లో గడుపుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. వీటివల్ల విద్యలో వెనుకబాటు, దృష్టిలోపంతో చదువుల్లో దిగజారుతున్నారు. ఆత్మవిశ్వాసం సన్నగిల్లడం ఇతరుల లైఫ్‌స్టైల్‌తో పోల్చుకోవడం, అసహనం, ఆందోళన, చేతిలో ఫోన్ లేకపోతే చంచలత, కోపంతో విచక్షణ కోల్పోతున్నారు.

కుటుంబాల్లో విభేదాలు

ప్రతి ఇంట్లో ఒకే దృశ్యం. భోజన సమయంలో కూడా చేతిలో మొబైల్ ఫోన్ ఉండాల్సిందే. దీంతో కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయం తగ్గిపోతోంది. తల్లితండ్రులు.. పిల్లలతో గడిపే సమయమే లేదు. మానవ సంబంధాలు సన్నగిల్లిపోతున్నాయి. సోషల్ మీడియా వ్యసనం మూలంగా సమాజంలో కొన్ని ముఖ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో సామాజిక వేరుపాటు, నిజమైన స్నేహితులు తగ్గిపోవడం, కల్చరల్ గ్యాప్, సంప్రదాయ ఉత్సవాల కన్నా ఆన్‌లైన్ ట్రెండ్స్‌కు యువత, చిన్నారులు ప్రాధాన్యం ఇవ్వడం, తరాల మధ్య అంతరం, పెద్దవాళ్లు.. చిన్నవాళ్ల మధ్య విలువలు లోపించడం, ఆలోచనల్లో పెరుగుతున్న దూరం. ఇవి ఎంతో ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

డిజిటల్ డీటాక్స్‌తో పరిష్కారం

స్మార్ట్‌ఫోన్ వ్యసనం నుంచి బయటపడడానికి నిపుణులు కొన్ని చిట్కాలు చెబుతున్నారు. తల్లితండ్రులు పాటించాలని సూచిస్తున్నారు. డిజిటల్ డీటాక్స్ విధానాన్ని పాటించాలంటున్నారు. ఇందులో భాగంగా రోజులో కనీసం 2-3 గంటలు ఫోన్‌లేకుండా గడపడం అలవాటు చేసుకోవాలని చిన్నారుల దగ్గరై వారిక ప్రేమతో చెప్పాలి. పిల్లలతో ఆడుకోవడం మాట్లాడుకోవం చేయాలి. దీంతోపాటు సోషల్‌మీడియా మన శత్రువు కాదు-అది మన జీవితంలో ఒక అద్భుత సాధనంగా మాత్రమే చూడాలన్న భావన చిన్నారుల మనసుకు హత్తుకునే విధంగా తల్లిదండ్రులు చెప్పాలి. అది వ్యసనంగా మారితే భవిష్యత్తును, కుటుంబ బంధాలను నాశనం చేస్తుందన్న విషయాలను చిన్నారులకు చిన్నతనం నుంచే నేర్పాలి. చేతిలో ఉన్న సాంకేతిక సాధనాలను మనమే నియంత్రించుకోవాలి కానీ, అవి మనల్ని నియంత్రించకూడదన్న విషయాలను పిల్లలకు అర్థమయ్యే విధంగా ప్రేమతో తెలియజెప్పాలి. భావితరాలకు మంచి భవిష్యత్తును అందించే విధంగా తల్లిదండ్రులు మారాలి.

మానసిక ఆరోగ్యంపై ప్రభావం



డాక్టర్లు చెబుతున్న ప్రకారం సోషల్ మీడియా వ్యసనం మద్యం, డ్రగ్స్ వ్యసనానికి సమానం. ఫోన్‌లో ప్రతిలైక్, ప్రతి నోటిఫికేషన్ మెదడులో డోపమిన్ అనే సంతోష హార్మోన్‌ను విడుదల చేస్తుంది. దీనివల్ల మనిషి మరింతగా ఆదే అనుభూతి కోసం ఫోన్‌పై ఆధారపడతాడు. దీంతో నిద్రలేమి, డిప్రెషన్, ఒంటరితనం, దృష్టిలోపం, వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కావున తల్లితండ్రులు.. పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి. చిన్నారులను కాపాడుకోవాలి.

- డాక్టర్ ఫైరోజ్‌బేగం, జిల్లా వైద్యాధికారి, శ్రీసత్యసాయి జిల్లా

సైబర్ వలలో యువత: ఎస్పీ రత్న



సోషల్ మీడియా అంటే వినోదం మాత్రమే కాదు, సైబర్ నేరాల వేదిక కూడా అవుతోంది. ఫేక్ ప్రొఫైల్, ఆన్‌లైన్ బుల్లీయింగ్, బ్లాక్‌మెల్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. లోన్ యాప్ మోసాల్లో ఎక్కువగా 18 నుంచి 25 ఏళ్ల యువత చిక్కుకుని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గేమింగ్‌లో మునిగిపోయిన చిన్నారులు తల్లిదండ్రుల డబ్బులు ఖర్చుచేసి అప్పుల పాలవుతున్నారు.

క్రైం కార్నర్

అలా కొట్టేసి.. ఇలా చిక్కేశాడు..!

- సినిమా థియేటర్‌లో చోరీ
- అక్కడ పనిచేసే వ్యక్తే నిందితుడు
- పట్టించిన సీసీ టీవీ ఫుటేజీ

కొత్తచెరువు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పుట్టపర్తి రహదారి పక్కనున్న సందీప్ థియేటర్‌లో ఇంటి దొంగ చేతివాటం ప్రదర్శించాడు. రూ.50 వేలు అలా కొట్టేసి.. ఇలా దొరికిపోయాడు. సీసీ టీవీ ఫుటేజీలో చోరీ వ్యవహారం స్పష్టంగా తెలిసిపోయింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. థియేటర్‌లో రెండు రోజుల సినిమా ప్రదర్శన డబ్బు రూ.50వేలు బీరువాలోనే ఉంచి, మేనేజర్ తాళం వేశారు. పక్కనే తన గదిలోకి వెళ్లి శుక్రవారం రాత్రి నిద్రించాడు. ఆ డబ్బుపై థియేటర్‌లోనే పనిచేస్తున్న బోయ ధనుష్ కన్నేశాడు. శనివారం తెల్లవారుజామున ముఖానికి మాస్క్ పెట్టుకుని, మేనేజర్ గదికి బయట గొళ్లెం పెట్టాడు. ఇనుప రాడ్డుతో బీరువా పగులగొట్టి, అందులోని రూ.50వేల నగదు అపహరించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఆ డబ్బు థియేటర్ ఆవరణలోనే ఉన్న ఆటోలో ఉంచి, అద్దెకు ఉంటున్న గదికెళ్లి నిద్రించాడు. శనివారం ఉదయం మేనేజర్ లేచి తన గదికి గొళ్లెం పెట్టి ఉండటంతో మరొకరికి ఫోన్ చేసి, తెరవమని చెప్పాడు. అతడు వచ్చి మేనేజర్ గది తెరిచారు. తరువాత బీరువా ఉన్న గదిని పరిశీలించగా తలుపులు తెరిచి ఉండటంతో చోరీ అయినట్లు గ్రహించి థియేటర్ యజమాని లక్ష్మీనారాయణకు తెలిపారు. ఆయన వచ్చి థియేటర్‌లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ధనుష్ చోరీ చేయడం, ఆ డబ్బు ఆటోలోనే ఉంచిన వ్యవహారం మొత్తం తెలిసిపోయింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు థియేటర్‌ను పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. ఆటోలో ఉంచిన రూ.50వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-బళ్లారి రైలు మార్గంలో బెవినహల్ రైల్వేస్టేషన్ సమీపాన శుక్రవారం రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయసు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9866144616 నంబరులో సంప్రదించాలన్నారు. వ్యక్తి మృతిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి మత్తు

రాయలచెరువులో యథేచ్ఛగా సేవిస్తున్న యువత

యాడికి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో యువకులు గంజాయి మత్తులో తూలుతున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఒక ధాబాను, ఆ పక్కనే ఉన్న అరటి తోటను ఇందుకు ఆవాసంగా మార్చుకున్నట్లు చెబుతున్నారు. బెంగళూరు నుంచి గంజాయి పౌడర్ ఇక్కడకు సరఫరా అవుతోందనీ, దానిని సిగరెట్లలో నింపుకుని, తాగుతున్నారని సమాచారం. లారీ డ్రైవర్ల ద్వారా కూడా గంజాయి సరఫరా అవుతున్నట్లు చర్చించుకుంటున్నారు. యువకులు ఎక్కువగా దీనికి బానిసలుగా మారుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ధాబా వద్ద, పక్కనే అరటితోటలో యువకులు గుంపులుగా తిష్టవేసి గంజాయి సేవిస్తున్నారని సమాచారం. గంజాయి మత్తులో యువకులు ఎటువంటి ఆగడాలకు పాల్పడుతారోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. రాయలచెరువు పారిశ్రామిక ప్రాంతం కావడంతో గంజాయి కల్చర్ ఎక్కువ అవుతోందని వారు వాపోతున్నారు. రాయలచెరువు నుంచి చందనకు వెళ్లే రోడ్డులోని ఓ ఆలయ పరిసరాల్లో కూడా యువకులు గంజాయి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో...' అంటూ ప్రచారం చేపట్టిన అధికారులు గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి, బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇద్దరు విద్యార్థులు అదృశ్యం


భరత్ రాజ్, లోకేష్

రాప్తాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రసన్నాయపల్లి సమీపంలోని ఎల్ఆర్జీ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమయ్యారు. వారి తల్లి తండ్రులు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. 8వ తరగతి విద్యార్థులు భరత్ రాజ్, లోకేష్ శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లారు. ఉదయం 9 గంటల సమయంలో పాఠశాల నుంచి బయటకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న తల్లితండ్రులు అన్నిచోట్లా గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో రాప్తాడు సీఐ హర్షకు ఫిర్యాదు చేశారు. విద్యార్థుల ఆచూకీ కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

లాటరీ టిక్కెట్ విక్రేతల అరెస్టు

కదిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిషేధిత లాటరీ టిక్కెట్లు, నాటుసారా అమ్ముతున్న ఐదుగురిని శనివారం అరెస్టు చేశామని పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. పక్కా సమాచారంతో కుటాగుళ్ల రైల్వే గేటు సమీపంలో ఎస్ఐ బాబ్‌జాన్ దాడులు చేశారని, నాటుసారా, లాటరీ టిక్కెట్లు అమ్ముతున్న ముఠా పారిపోతుండగా ఐదుగురిని పట్టుకున్నారని సీఐ తెలిపారు. పోలీసుల దాడుల గురించి తెలుసుకుని, మరో ఆరుగురు అక్కడికి రాకుండా పారిపోయారని తెలిపారు. పట్టుబడిన వారిలో జయప్రకాష్ బాబు, బాబా ఫక్రుద్దీన్. శిలార్ బాషా, నవీన్ కుమార్, మహమ్మద్ అలి ఉన్నారు. వీరంతా కదిరి పట్టణవాసులు. నిందితుల నుంచి 5 సెల్ ఫోన్‌లు, 16 లీటర్ల నాటుసారా, 47 లాటరీ టిక్కెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి, న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పారిపోయిన వారిపైనా కేసు నమోదు చేశామని, త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బాలికను పెళ్లి చేసుకునేందుకు తీసుకెళ్లిన ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశామని టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ శనివారం తెలిపారు. ఆత్మకూరు మండలం గొరిదిండ్లకు చెందిన పోతులయ్య ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడని సీఐ తెలిపారు. అనంతపురంలోని కేఎస్ఆర్ కాలేజీ ఇంటర్ చదువుతున్న విద్యార్థిని పెళ్లి చేసుకునేందుకు ఈ నెల 11న ధర్మవరం తీసుకెళ్లాడని తెలిపారు. విద్యార్థిని మైనర్ అని, తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ప్రత్యామ్నాయం అందేనా..?

- జిల్లాకు 15 వేల క్వింటాళ్లతో ప్రతిపాదనలు
- నేటికీ సరఫరాకాని ప్రత్యామ్నాయ విత్తనాలు
- ముగింపు దశకు ఖరీఫ్
- బయట కొనుగోలు చేస్తున్న రైతులు


ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం చేసుకున్న భూమి

మడకశిర, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ ఊసేలేకుండా పోయింది. ఆ ఊసే వినిపించట్లేదు. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్నా.. విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పొలాలను సిద్ధం చేసుకుని, ఎదురుచూస్తున్నారు. జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆ తరువాతి ప్రక్రియే మొదలుకాలేదు. ఏటా ఆగస్టు మొదటి వారంలోనే పంపిణీ చేసేవారు. ఈ సారి సెప్టెంబరు సగం నెల గడుస్తున్నా.. ఆ ఊసేలేకపోవడంతో అన్నదాతలు ఆశలు వదులుకుంటున్నారు. కొందరు బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేసి, పంట పెడుతున్నారు. ఇంకొందరు ఇంకా ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. రైతన్నలు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. అధికారులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపినా సరఫరాలో జాప్యం చేస్తున్నారు. భూములను సిద్ధం చేసుకున్న రైతులు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట వేయాలని భావిస్తున్నారు. విత్తనాలు సరఫరా చేయకపోవడంతో నిరాశ చెందుతున్నారు. జిల్లాలో 60 వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 15వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు పంపారు. నేటికీ పంపిణీ చేయలేదు.

విత్తనాలు ఇవ్వకపోతే బీడుగా వదిలేస్తా



ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుందామని రెండెకరాల పొలాన్ని సిద్ధం చేసుకున్నా. వర్షాభావం కారణంగా వేరుశనగ పంట పెట్టలేకపోయా. ప్రత్యామ్నాయ విత్తనాలు నేటికీ అందించలేదు. వారం రోజులు దాటితే ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు వస్తుంది. ఇప్పటికైనా అధికారులు విత్తనాలు పంపిణీ చేయాలి. లేకపోతే పొలాన్ని బీడుగా వదిలాల్సి వస్తుంది.

-నరసింహప్ప, రైతు, కాలువపల్లి

ప్రతిపాదనలు పంపాం

మడకశిర నియోజకర్గంలో 11వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 4,500 క్వింటాళ్ల ఉలవలు, పెసలు, అలసంద, జొన్న విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపాం. సరఫరా అయిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తాం.

-తిమ్మప్ప, వ్యవసాయ అధికారి

క్రీడాభివృద్ధిలో రాజీ ప్రసక్తే లేదు

- ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్
- రాయలసీమ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభం



క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న మాంచో ఫెర్రర్, అనూష

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధిలో రాజీపడే ప్రసక్తే లేదని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ పేర్కొన్నారు. అనంత క్రీడాగ్రామంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌ను భారత మహిళా క్రికెట్ జట్టు ప్లేయర్ అనూషతో కలిసి మాంచో ఫెర్రర్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయి అధునాతన వసతులతో స్టేడియం నిర్మించడం శుభపరిణామమన్నారు. క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సత్తా చాటాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి, మాజీ అధ్యక్షుడు పగడాల మల్లికార్జున, రంజీ మాజీ క్రికెటర్లు ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి, షాబుద్దీన్, ఫయాజ్ అహ్మద్, సురేష్, షాషావలి, డీబీ ప్రశాంత్ కుమార్, శివరాజ్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

అనూషకు సత్కారం



అనూషకు చెక్కును అందజేస్తున్న మాంచో ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన జిల్లాకు చెందిన తొలి క్రికెటర్ అనూషను జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ శనివారం సత్కరించారు. ఆర్డీటీ స్టేడియంలో అనూషకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందజేశారు. అనూషను క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలని మాంచో ఫెర్రర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16


అనంతపురం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16,500 పలికాయని మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి ధరరూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 556టన్నుల చీనీకాయలు వచ్చాయని తెలిపారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు జైలు శిక్ష

పామిడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి మహిళ మృతికి కారణమైన వ్యక్తికి గుత్తి జేఎఫ్‌సీఎం కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. రూ.2వేలు జరిమానా కూడా విధిస్తూ శనివారం తీర్పు వెలువరించింది. సీఐ యుగంధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2015లో పట్టణ సమీపాన జాతీయ రహదారిపై సయ్యద్ అబూబ్ కారు నిర్లక్ష్యంగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. అందులో ప్రయాణిస్తున్న లలితమ్మ తీవ్రంగా గాయపడి మరణించింది. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయాధికారి సయ్యద్ అబూబ్‌ను ముద్దాయిగా నిర్ధారిస్తూ ఆరు నెలలు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆలయాలను సందర్శించిన

తెలంగాణ అధికారులు


ఆలూరు కోనలో అధికారులు

తాడిపత్రి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు కోన, ఓబులేసు కోన, బెలుంగుహలు, హాజీవలి దర్గా తదితర ఆలయాలను శనివారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు సందర్శించారు. ఆయా ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలను సందర్శించిన వారిలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఐఆర్ఎస్ అధికారి రామకృష్ణ, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ నయీముల్లా, అమరరాజా బ్యాటరీ సీఈఓ రమణ, జనరల్ మేనేజర్ గల్లా విజయ్‌నాయుడు, పారిశ్రామికవేత్త శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఆదివారం పట్టణంలోని ఏవీఆర్ ప్యారడైజ్‌లో 1976-79 కొడిగెనహళ్లి బ్యాచ్‌కు చెందిన వీరు గెట్ టుగెదర్ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా బదిలీ



గుంతకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఎస్పీ రాహుల్ మీనా బదిలీ అయ్యారు. ప్రభుత్వం ఆయనను బీఆర్అంబేడ్కర్ కోన సీమ జిల్లాకు బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్/రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ జట్లను శనివారం ఎంపిక చేశారు. అనంతపురం నగర పరిధిలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో స్విమ్మింగ్, రైఫిల్ షూటింగ్ సెలెక్షన్స్ నిర్వహించారు. స్కూల్ చైర్మన్ అనంతరాముడు పోటీలను ప్రారంభించారు. ఎంపికైన వారి వివరాలను స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు వెల్లడించారు. స్విమ్మింగ్ అండర్-14, 17, 19 బాల, బాలికల విభాగాల్లో మొత్తం 45మందిని, రైఫిల్ షూటింగ్ అండర్-17, 19 బాలబాలికల విభాగాలలో 60 మందిని ఎంపిక చేశారు. వారు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఈఓ నరసింహారావు, ప్రిన్సిపాల్ శాలిని, పీడీలు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, నరసింహారెడ్డి, పీఈటీలు నిరంజన్‌రెడ్డి, ఓబులేసు, సమీరా, రేఖ, లీలారాణి, ప్రత్యూష పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలుడి మృతి

ఆస్పత్రి వద్ద తల్లిదండ్రుల ఆందోళన


కిరణ్ ఆసుపత్రి వద్ద బాలుడి తల్లిదండ్రులు

పావగడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కుందుర్పి మండలం వెంకటంపల్లికి చెందిన మూడు నెలల బాలుడు అనారోగ్యంతో మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యమే తమ కుమారుడి మృతి కారణమని తల్లిదండ్రులు మంజునాథ్, గీత, వారి బంధువులు ఆరోపించారు. పావగడ తాలూకా లింగదహళ్లిలోని కిరణ్ ఆస్పత్రి ఎదుట శనివారం ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన మేరకు బాలుడికి మూడు రోజుల క్రితం నోటిలో పుండు ఏర్పడింది. దీంతో లింగదహళ్లిలోని డాక్టర్ కిరణ్ ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో శుక్రవారం రాత్రి మరోసారి అదే ఆస్పత్రికి తీసుకువచ్చారు. డాక్టర్ కిరణ్ మందులిచ్చి, చికిత్స చేశారు. కాసేపటికి బాలుడి నోటి నుంచి నురుగు రావడంతో పరిస్థితి విషమించిందని, మరో ఆస్పత్రికి తీసుకువెళ్లాలని డాక్టర్ సూచించారు. దీంతో తల్లిదండ్రులు బాలుడిని పావగడకు తీసుకువెళ్లారు. అప్పటికే పసివాడు ప్రాణాలు కోల్పోయాడు. తమ కుమారుడిని ముందుగానే వేరే ఆస్పత్రికి పంపించి ఉంటే బతికేవాడని తల్లిదండ్రులు అన్నారు. పరిస్థితి విషమించాక చేతులెత్తేశాడని కన్నీటి పర్యంతమయ్యారు. తమకు జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదని, క్లినిక్‌ను మూసివేయాలని బాలుడి తల్లిదండ్రులు, బంధువులు డిమాండ్ చేశారు.


వృద్ధుడిని ఆస్పత్రిలో చేర్పించిన విద్యార్థినులు

గొప్ప మనసులు..!

అయినవారు పట్టించుకోలేదు.. ఆలనాపాలనా చూసుకోలేదు. వృద్ధుడిని రోడ్డున పడేశారు. అయ్యా.. అమ్మా.. అంటూ దారిన వెళ్లేవారిని యాచిస్తూ ఉన్నాడు.. తిండిలేక, నీరులేక.. నీరసించిపోయాడు. అందరూ చూస్తూ.. వెళ్తున్నారే తప్ప.. ఎవ్వరూ పట్టించుకోలేదు. చదువుకునే చిట్టి తల్లులు.. ఆ అభాగ్యుడి దీనస్థితిని చూసి, చలించిపోయారు. అన్నం పెట్టి, నీరు ఇచ్చారు.. కాళ్లకు పుండ్లు ఏర్పడి, పురుగులు పట్టడాన్ని గమనించి అయ్యో.. పాపం.. అనుకున్నారు. వెంటనే ఆటోలో ఆస్పత్రికి చేర్చారు. చికిత్స చేయించారు. పెద్దమనసు చాటుకున్న ఆ అమ్మాయిలు కల్యాణి, త్రివేణి, శిరీష, లతాశ్రీ. నగరంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కళాశాల ముందు కొన్ని రోజులుగా దీనస్థితిలో యాచిస్తున్న వృద్ధుడిని శనివారం సర్వజనాస్పత్రికి తరలించారు. అయిన వాళ్లే కాదనుకున్న ఆ అభాగ్యుడి పట్ల మానవత్వం చూపారు. గొప్ప మనసు చాటుకున్నారు. వారిని ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది అభినందించారు. వృద్ధుడిని వివరాలు ఆరాతీయగా.. తన పేరు సత్యనారాయణ అనీ, తనది బుక్కపట్నం అని చెప్పారు. కుటుంబ సభ్యుల వివరాలు మాత్రం వెల్లడించలేదు. తన పిల్లలకు ఎక్కడ చెడ్డపేరు వస్తుందోనని ఎంత అడిగినా వారి గురించి మాత్రం చెప్పలేదు. అదే తండ్రి మనసు.

- అనంతపురం విద్య, ఆంధ్రజ్యోతి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

విడపనకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకముక్కల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అజ్మతుల్లా శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన అండర్-14, 17, 19, విభాగాల్లో కరకముక్కల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో ఏడో తరగతి విద్యార్థి హెచ్ అఖిల్, అండర్ 17లో పదో తరగతి చదువుతున్న సుజాత, అండర్ 19 విభాగంలో తొమ్మిదో తరగతికి చెందిన ఎం భానుప్రియ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. త్వరలోనే ఉరవకొండలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. వారిని టీచర్లు అభినందించారు.

రొద్దం విద్యార్థులు..



విద్యార్థి వేదవ్యాస్‌ను అభినందిస్తున్న టీచర్లు

రొద్దం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రొద్దం, తురకలాపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదివే ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల బుక్కపట్నం డైట్ కళాశాలలో నిర్వహించిన కళా ఉత్సవ్ 2025 పోటీల్లో రొద్దం పాఠశాలలో 9వ తరగతి చదివే వేదవ్యాస్ సంగీత వాయిద్య పోటీల్లో ప్రతిభ చాటి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. అక్టోబరులో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. తురకలాపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన సాయి, ప్రణీత్ రాజ్, దీక్షిత్‌రెడ్డి సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రామకృష్ణ తెలిపారు. అక్టోబరు 4నుంచి విశాఖపట్నం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం లింగప్ప, టీచర్లు అభినందించారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన డీఎంహెచ్‌ఓ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ ఆనంద్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈర్ల భ్రమరాంబికా దేవి శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త(డీసీక్ర) డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా కలెక్టర్ ను కలిసి పుష్పగుచ్ఛమందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన నెట్‌వర్క్ హాస్పిటళ్ల ద్వారా అందుతున్న వైద్యసేవలను కలెక్టర్‌కు వివరించారు.

నిరుద్యోగులకిచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

అనంతపురం విద్య, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐజిల్లా కార్యాలయంలో శనివారం ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్‌బేరర్స్ సమావేశం జరిగింది. ఇందులో నారాయణస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు కూటమి పెద్దలు ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీచేస్తామని, ఐదేళ్లలో 20లక్షలమందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, ఉద్యోగాలు పొందని నిరుద్యోగులకు నెలకు రూ3వేలు నిరుద్యోగభృతిని చెల్లిస్తామని హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక అవేమీ అమలు చేయలేదన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొట్రేష్, జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇచ్చినహామీల అమలు చేయాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న విజయవాడలో నిరుద్యోగుల ఆవేదన రాష్ట్రసదస్సు నిర్వహించనున్నామన్నారు. నిరుద్యోగ యువతపెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు దేవేంద్ర,వంశీ,ధనుంజయ,శ్రీనివాసులు, తేజ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులు.. ఉపాధికి మార్గాలు



వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ సతీష్

గార్లదిన్నె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా కోర్సులు యువతకు ఉపాధి మార్గాలు చూపుతాయని మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సాకే సతీష్ పేర్కొన్నారు. పాఠశాలలో శనివారం ఆయన టెన్త్, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు వృత్తివిద్యాకోర్సులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు జనరల్ కోర్సులతో పాటు (ఒకేషనల్) వృత్తి విద్యా కోర్సులను అందించేందుకు 2016లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయన్నారు. ఇందులో భాగంగా ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్స్, టెక్స్‌టైల్స్ (ఒకేషనల్) కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందేందుకు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనింగ్ మాస్టర్ నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఐటీ విద్యార్థుల లేపాక్షి యాత్ర

రాప్తాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సమీపంలో గల ఎస్‌వీఐటీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు లేపాక్షి ఆలయాన్ని సందర్శించారని కళాశాల కరెస్పాండెంట్ వీబీ ఆర్ శర్మ తెలిపారు. ఈ యాత్ర విద్యార్థులకు చారిత్రక పరిజ్ఞానం పెంపొందించడంలో తోడ్పడుతుందన్నారు. లేపాక్షి ఆలయ చరిత్ర గురించి అధ్యాపకులు విద్యార్థులకు వివరించారన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ అనిత

అనంతపురం రూరల్, సెపెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని బీఎడ్ కళాశాలలో సహాయ ఆచార్యులుగా పని చేస్తున్న వీ. అనితకు ఏపీ ఎంపీ అసోసియేషన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం చేసింది. శనివారం విజయవాడ లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. గత 20ఏళ్లగా ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలకు గాను అసోసియేషన్ అవార్డును అందించినట్లు ఆమె తెలిపారు. అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. మరింత బాధ్యతను పెంచిందన్నారు.

దళిత రణభేరి పోస్టర్లు విడుదల

శింగనమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దళిత రణభేరి సభను విజవంతం చేయాలని బీఎస్పీ శింగనమల ఇన్‌చార్జి ఎన్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని రామస్వామి ఆలయంలో శనివారం ఆయన ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 24 వతేదీన విజయవాడలో దళిత రణభేరి జరగనుందన్నారు. సభకు పెద్ద ఎత్తున దళితులు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరికి తరలిరండి

రాప్తాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న విజయవాడలో నిర్వహించే రణభేరిని విజయవంతం చేయాలని ఆ ఫెడరేషన్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటనాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని బండమీదపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, డీఏ విడుదల చేసి బకాయిలు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మారుతి, ఉపాధ్యాయులు వన్నూరప్ప, నరసింహులు, అయూబ్‌ఖాన్, హరిక్రిష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, టీచర్లు





పెద్ద ఎత్తున గుంతలు పడి.. నీటి మడుగును తలపిస్తున్న కళాకారుల కాలనీ నుంచి ఆదర్శ నగర్‌కు వెళ్లే రోడ్డు



ప్రయాణం.. నరకప్రాయం

- ఆర్డీటీ స్టేడియం నుంచి కళాకారుల కాలనీకి వెళ్లే రోడ్డు గుంతలమయం
- బెంబేలెత్తుతున్న వాహనదారులు, పాదచారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్డీటీ స్టేడియం ప క్కన ఉన్న పండమేరు బ్రిడ్జి సమీపం నుంచి క ళాకారుల కాలనీ, చిన్మయనగర్, ప్రసన్నాయప ల్లి, హౌసింగ్‌బోర్డు, జేఎన్‌టీయూ, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, ఆర్టీఓ ఆఫీస్, భైరవనగర్, ఆదర్శనగర్ లోకి వెళ్లే దారి పూర్తిగా గుంతలమయమైంది. ఆ రోడ్డులో మోకాల్లోతు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. రోడ్డులోని గుంతల్లో నీరు చేరడంతో మడుగును తలపిస్తోంది. ఏ గుంత ఎంత లోతు ఉందో తెలియక వాహనదారులు, పాదచారులు హడలెత్తుతున్నారు. ప్రజాప్రతినిధులు, అ ధికారులు స్పందించి వెంటనే రోడ్డును మరమ్మ తు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

'మరొక ఆర్టీసీ బస్సును నడపండి'



ఆర్టీసీ బస్సులో కిక్కిరిసిన ప్రయాణికులు

రామగిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయాలంటేనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండలంలోని తిమ్మాపురం, ఎంసీపల్లి, గరిమేకలపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు, ఇతర ప్రయాణికులు వాపోన్నారు. ధర్మవరం డిపో నుంచి రామగిరి, పేరూరు మీదుగా గరిమేకలపల్లికి సాయంత్రం సమయంలో ఒకే బస్సు సౌకర్యం ఉంది. అయితే ప్రస్తుతం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండడంతో అందులో వారే అధికంగా ప్రయాణిస్తున్నారు. దీంతో తాము ప్రయాణించేందుకు వీలు పడడం లేదని విద్యార్థులు, ఇతర ప్రయాణికులు వాపోతున్నారు. చేసేదిలేక ఆటోలను ఆశ్రయిస్తున్నామన్నారు. ఆర్టీసీ అధికారులు సాయంత్రం సమయంలో ఈ రూట్‌లో మరో బస్సును నడపాలని వారు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చెన్నేకొత్తపల్లికి చెందిన పవనకుమార్ రెడ్డి బైక్‌లో గ్రామంలోకి వస్తున్నాడు. జాతీయ రహదారి జంక్షన్ వద్దకు రాగానే బెంగళూరు నుంచి అనంతపురం వైపునకు వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే దగ్గర్లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

సూపరిండెంట్‌ను కలిసిన బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిండెంట్‌ను బీజేపీ నాయకులు శనివారం కలిశారు. ఇటీవల సూపరిండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సుబ్రమణ్యంను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బోనాల మారుతీ గోవిందప్రసాద్, ఓబీసీ రాష్ట్ర నాయకులు ఆవుల చక్రధర్‌యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వంకదారి నాగరాజు, ఆశావాది రవి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

పాలికేకను విజయవంతం చేద్దాం



అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ పరిరక్షణ కోసం తలపెట్టిన ప్రజాపాలికేక కార్యక్రమాన్ని అందరం విజయవంతం చేద్దామని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి శనివారం వారు ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించి సేవ్ ఆర్డీటీ నినాదాలు చేశారు. అనంతరం నాయకులు బీసీఆర్ ఆదస్, సాకేహరి, డాక్టర్ అక్కులప్ప మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతజిల్లాలో పేదల జీవితాలను మార్చేందుకు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆర్డీటీని స్థాపించారన్నారు. ఆరు దశాబ్దాల ఆర్డీటీ సేవలతో లక్షలాది నిరుపేదల జీవన స్థితిగతులు మారాయన్నారు. మరోవైపు ప్రభుత్వానికి దీటుగా ప్రలందరికీ వైద్య, విద్య సేవలు అందాయన్నారు. ఇంతటి ప్రాధాన్యం గల ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తోందని ప్రశ్నించారు. ఆర్డీటీని కాపాడుకోవడానికి ప్రజలందరూ నడుంబిగించాలన్నారు. ఈనెల 15న ఆర్ట్స్ కళాశాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు సాగే పొలికేక ప్రదర్శన ర్యాలీ పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ఎల్లన్న, దాసగానిపల్లి కుళ్లాయప్ప, శ్రీరాములు, అంజి, శీను, రామాంజినేయులు, సూరి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనుల్లో ముందుంటాం: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు ఉపయోపడే పనులు చేయడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో మండలంలోని వెస్టునరసాపురం, నాగులగుడ్డతండా రైతులు వర్షం నీరు వృథాకాకుండా చెక్‌డ్యాంలు నిర్మించాలని తన దృష్టికి తీసుకొచ్చారని, తాను ఎమ్మెల్యే అవగానే ఆ గ్రామాల్లో వాటర్ షెడ్ పథకం కింద చెక్ డ్యాంలు మంజూరు చేయించి నిర్మింపజేశామని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ చెక్ డ్యాంలు నిండి నిండుకుండలా ఉన్నాయన్నారు. వాటి వల్ల వ్యవసాయ బోర్లలో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. చెక్‌డ్యాంలు నిండడంతో రైతులు తనకు ఫోన్ చేసి హర్షం వ్యక్తం చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాలకు మరిన్ని నీటిపథకాలను తీసుకుని వస్తానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

నెలాఖరులోగా పంట నమోదు పూర్తవ్వాలి



గొందిరెడ్డిపల్లిలో పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ

రాప్తాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నెలాఖరులోగా పంట నమోదు పూర్తి చేయాలని వ్యవసాయశాఖ ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. మండలంలోని గొందిరెడ్డిపల్లిలో శనివారం ఆయన ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పొలాల్లో పర్యటించి రైతులు ఏ పంట సాగు చేశారో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం రాప్తాడులోని ఎఫ్‌పీఓ షాపులో ఈపాస్ మిషన్ ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండలంలోని ఎఫ్‌పీఓ షాపునకు 280 బస్తాల యూరియా సరఫరా చేశామన్నారు. ఒక్కో రైతుకు ఒక బస్తా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణచైతన్య, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కిష్టా, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దంత వైద్య శిబిరం

నార్పల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయ్యప్ప స్వామి, లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మేంద్ర స్వామి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం జరగనుంది. జిల్లాకేంద్రానికి చెందిన ప్రఖ్యాత దంత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అర్చకుడు కోరారు.

కేసుల రాజీకి లోక్‌అదాలత్ ఉత్తమ మార్గం



మాట్లాడుతున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి భీమారావు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ కేసుల రాజీకి ఉత్తమ మార్గమని అనంతపురం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి భీమారావు తెలిపారు. జిల్లాకేంద్రంలోని కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. రెగ్యులర్ కోర్టుల్లో కేసులు పరిష్కారమైనప్పుడు ఎవరో.. ఒకరే గెలిచే అవకాశం ఉందన్నారు. అదే లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం చేసుకుంటే.. ఇరు వర్గాల వారు సంతోషంగా ఇంటికి చేరుతారన్నారు. తర్వాత జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు లోక్ అదాలత్‌లో చాలా కేసులు పరిష్కారమయ్యాయన్నారు. మోటార్ వాహనాల ప్రమాదాలకు సంబంధించిన 32 కేసుల్లో కక్షిదారులకు రూ. 1.26 కోట్ల నష్టపరిహారం ఇచ్చేలా తీర్పులు వచ్చాయన్నారు. అలాగే 56 సివిల్ వివాదాలు, 2351 ప్రీ లిటిగేషన్ కేసులు, ఎన్‌ఐ యాక్ట్‌కు సంబంధించి 23 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఇలా మొత్తం 6542 కేసులు పరిష్కారమై 3.33 కోట్లు పరిహారం వచ్చినట్లు పేర్కొన్నారు. ఫస్ట్ ఏడీజె సత్యవాని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, న్యాయమూర్తులు, పలు బ్యాంకుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలోని 16 మందికి రూ.10.72 లక్షల మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పరిటాల సునీత అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారు. తర్వాత ఆమె మాట్లాడుతూ... మెడికల్ కాలేజీలతో గత ప్రభుత్వం హడావిడి చేసిందన్నారు. ఏ ఒక్కటీ నిర్మించకుండా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. పీపీపీ విధానంలో కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలు నిర్మాణం చేపడుతుంటే...ప్రైవేట్ పరం చేస్తున్నారంటూ వైసీపీ విషప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు.

'బీసీల రిజర్వేషన్ల పెంపును అమలు చేయాలి'



మాట్లాడుతున్న అమర్‌యాదవ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బీసీల రిజర్వేషన్ల పెంపును అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్‌యాదవ్ కోరారు. నగరంలోని జేఏసీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు విద్య, వైద్యం, ఉపాధి, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో 49 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఏ విధంగా అయితే రిజర్వు పార్లమెంటు, శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయో... ఆ విధంగానే జనాభా ప్రాతిపదికన బీసీలకు కూడా రిజర్వు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అదే విధంగా బీసీ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి బీసీలకు బీసీ యాక్టు చట్టం తీసుకురావాలని అన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జి డీఎస్‌డీఓ



బాధ్యతలు స్వీకరిస్తున్న మంజుల

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాభివృద్ధి ఇన్‌చార్జి అధికారి(డీఎస్‌డీఓ)గా ఎస్‌ఎం మంజుల శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు శ్రీసత్యసాయి జిల్లా డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ ఇన్‌చార్జిగా కొనసాగారు. ఇప్పుడు ఆ స్థానంలోకి సీనియర్ అథ్లెటిక్ కోచ్‌గా ఉన్న ఎస్‌ఎం మంజులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ శాప్ చైర్మన్, ఎండీలు ఉత్తర్వులు జారీ చేశా రు. దీంతో ఆమె స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలి శారు. మంజులకు శాప్ డైరెక్టర్ బొమ్మనేని శివ, కోచ్‌లు లక్ష్మి, నరేష్, అనిల్‌కుమార్, అలి అభినందనలు తెలిపారు.

మరవకొమ్మ వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న యువకులు

శింగనమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరవకొమ్మ వద్ద కొందరు యువకులు ప్రతి శనివారం రుష్య శృంగముని, శ్రీరంగరాయని పేరు మీద అన్నదానం చేస్తున్నారు. బాటసారుల ఆకలి తీర్చేందుకు, అన్నదానం విలువను కాపాడేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని వారు తెలిపారు. 11 వారాలుగా ప్రతివారం దాతల సహకారంతో దాదాపు 300 నుంచి 400 మంది వరకు అన్నదానం చేస్తున్నామని చెప్పారు. దీంతో ఆ యవకులను పలువురు అభినందిస్తున్నారు.

మాజీ మంత్రి శైలజనాథ్‌కు అస్వస్థత

శింగనమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ శింగనమల నియోజకవర్గం సమన్వయ కర్త సాకే శైలజనాథ్ అస్వస్థకు గురయ్యారు. వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శైలజనాథ్ తొందరగా కోలుకోవాలని పార్టీ కార్యకర్తలు, నాయకులు కోరుకుంటున్నారు.

భాస్కర్‌రెడ్డి మృతికి 'వైకుంఠం' సంతాపం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతికి అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి శనివారం ప్రకటనలో సంతాపం తెలిపారు. భా స్కర్‌రెడ్డి రాజకీయాలతో సంబంధం లేకుండా అందరితో స్నేహభావంతో మెలిగేవారన్నారు. తాను చాలా ఏళ్ల స్నేహపూర్వకంగా మెలిగానన్నారు. ఆయన భౌతికంగా దూరం కావడం బాధాకరమని పేర్కొన్నారు.

'అక్రమ నియామకాలను రద్దు చేయాలి'

అనంతపురం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల అక్రమ నియామకాలను రద్దు చేయాలని ఏఐఎస్‌ఏ (ఐసా) జాతీయ కార్యవర్గ సభ్యుడు వేమన డిమాండ్ చేశారు. ఆమేరకు శనివారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో గత కొన్నేళ్లుగా జీఓ నెంబరు 203కు విరుద్ధంగా 15మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు కొనసాగుతున్నారన్నారు. వీరి నియామకాలలో పారదర్శకత లేనితనం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దీని వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. కనుకఅసిస్టెంట్ ప్రొఫెసర్ల అక్రమ నియామకాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, భీమేష్ పాల్గొన్నారు.



మధుమూర్తికి వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్‌ఏ నాయకులు

సర్టిఫికెట్ల మంజూరులో తీవ్ర జాప్యం

- సెలవులో అనంతపురం రూరల్ తహసీల్దార్
- వారం రోజులు కావస్తున్నా ఇన్‌చార్జి తహసీల్దార్‌కు అందని డిజిటల్ కీ
- సర్టిఫికెట్లు జారీ కాక ఇబ్బంది పడుతున్న ప్రజలు



అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని ప్రజలు వివిధ సర్టిఫికెట్లు పొందడానికి నానా కష్టాలు పడుతున్నారు. సకాలంలో సర్టిఫికెట్లు మం జూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం తహసీల్దార్ సెలవులో వెళ్లడమే. రూరల్ మండల తహసీల్దార్ వారం కిందట వ్యక్తిగత పనుల నిమత్తం సెలవులో వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి బాధ్యతలు అర్బన్ తహసీల్దార్‌కు జిల్లా ఉన్నాతాధికారులు అప్పగించారు. ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ సదరు అధికారి ప్రజలకు సేవలు అందించలేని దుస్థితి నెలకొంది. సర్టిఫికెట్ల జారీ చేసేందుకు డిజిటల్ కీ ఇవ్వాల్సి ఉంది. అయితే ఇంతరకు డిజిటల్ కీ ఇవ్వకపోవడంతో ప్రజల అందాల్సిన సర్టిఫికెట్లలో జాప్యం జరుగుతోంది.

వందల సంఖ్యలో సర్టిఫికెట్లు పెండింగ్

మండలంలోని ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం మీసేవ, సచివాలయాల్లో సర్టిఫికెట్లకోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందులో కులధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణతోపాటు జనన, మరణధృవీకరణ పత్రాలకు దరఖాస్తులు వస్తున్నాయి. రోజుకు ఎంత లేదన్నా 50 నుంచి 100వరకు సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు వ స్తున్నాయి. ఆదాయ ధృవీకరణ పత్రం డిప్యూటీ త హసీల్దార్ స్థాయిలో పూర్తవుతుంది. మిగిలిన సర్టిఫికెట్లకు తహసీల్దార్ సంత కం తప్పనిసరి. అయితే గత వారం రోజులుగా వీటికి బ్రేక్ పడింది. తహసీల్దార్ సెలవులో వెళ్లడం. ఇన్‌చార్జి తహసీల్దార్‌కు డిజిటల్ కీ ఇవ్వకపోవడంతో సమస్య నెలకొంది. గతంలో రెండు, మూడు రోజుల్లో ఇన్‌చార్జి తహసీల్దార్లకు డిజిటల్ కీ ఇచ్చేవారు. అయితేప్రస్తుతం జిల్లా ఉన్నాతాధికారులు బదిలీ నేపథ్యంలో ఆలస్యం అవుతున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని సర్టిఫికేట్లు సకాలం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సంక్షిప్త వార్తలు

వైభవంగా పల్లకి సేవ



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు.

మురుగునీటి కాలువ సమస్య పరిష్కారం



కాలువ సమస్యను ఎంఈకి తెలియజేస్తున్న కౌన్సిలర్

గుంతకల్లుటౌన్,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వ వార్డులో మురుగు నీటి కాలువ సమస్యను శనివారం ఆ వార్డు టీడీపీ కౌన్సిలర్ ఆర్. పవన్‌కుమార్ గౌడ్ పరిష్కరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా వార్డులో మురుగు నీటి కాలువ చిన్నదిగా ఉండేదని, చిన్నపాటి వర్షానికి మురుగు నీరు బయటకు వ చ్చి ప్రధాన రహదారిలో నీరు నిలబడటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీర్ ఇంతియాజ్ అహ్మద్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. మధ్యాహ్నం ఇంజనీర్ వార్డులో పర్యటించి కాలువ వెడల్పు కోసం సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

క్షవర వృత్తిదారుల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక హంపిరెడ్డి భవనంలో శనివారం పట్టణ క్షవర వృత్తి దారుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ.. కార్పొరేట్ షాపుల వల్ల మంగళి షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నావారు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. పట్టణ క్షవర వృత్తిదారుల సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా బ్రహ్మ, ఉపాధ్యక్షులుగా బాల, వాసు, అజయ్, శంకర్, నరేష్, సహాయకార్యదర్శులుగా బాలకృష్ణ, సోమశేఖర్, నవీన్, వంశీ, కుమార్, పరుశురాముడు, ఎం. శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థి సమాఖ్యకు..

ఉరవకొండ : అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుళ్లాయిస్వామి, ప్రధాన కార్యదర్శిగా మధు, ఉపాధ్యక్షుడిగా సాయి భాస్కర్, సహాయ కార్యదర్శులుగా మహేష్, వినయ్, కిరణ్, వంశీ, కార్తీక్, కుమార్, రాజేష్‌లతో పాటు మరో 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై పోరాడతామని తెలిపారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పామిడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం ఆ పార్టీ అగ్రనేత సీతా రాం ఏచూరి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళి అర్పించా రు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీతారాం ఏ చూరి ఆశయాలను యువత కర్తవ్యంగా భావించాలన్నారు. అభ్యుదయ, లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల పాత్రను తీసుకువెళ్లడంలో సీతారాం ఏచూరి కృషి ఎనలేనిదన్నారు. కా ర్యక్రమం లో నాయకులు అనిమిరెడ్డి, మల్లేష్, ల క్ష్మణ్ కుమార్, సాయికుమార్, మాబు, ఉసేనప్ప, ఎరుకలప్ప, జయరాముడు పాల్గొన్నారు.

2,398 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 2,398 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో 2,358 క్యూసెక్కులు వెళుతోందని, ప్రస్తుతం రిజర్వాయరులో 1.718 టీఎంసీలు నీటి నిల్వ వుందని వెల్లడించారు. ఫేజ్-2కు 2004 క్యూసెక్కులు వెళుతుందని అధికారులు తెలిపారు.

ఆర్థిక సాయం

కుందుర్పి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటకు చెందిన హనుమంతరాయుడు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న గుంతకల్లు యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ డైరెక్టర్ జయ న్న తన వంతు సహాయంగా రూ. 20 వేలు, ఇతర దాతల సహ కారంతో రూ.10వేలు మొత్తం రూ. 30 వేలు బాధిత కుటుంబానికి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివలింగప్ప, రుద్రముని, వన్నూరుస్వామి, ఓబయ్య సురేష్, జయచంద్ర, ఓబయ్య, సురేష్, సందీప్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న సమాజ సేవకుడు జయన్న

గుంతల రోడ్డుతో స్తంభించిన రాకపోకలు

● గుత్తిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ● కిలోమీటర్ల మేర నిలిచిపోతున్న వాహనాలు



అనంతపురం, గుంతకల్లు రోడ్లలో భారీగా నిలిచిపోయిన వాహనాలు, బస్సులు దిగి వస్తున్న ప్రయాణికులు

గుత్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుంతల రోడ్డుతో నిత్యం ట్రాఫిక్ స్తంభించి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గుత్తి పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో గుంతలతో శనివారం ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలోని గాంధీ చౌక్ నుంచి 63వ జాతీయ రహదారి వరకు ఉన్న తారురోడ్డు ధ్వంసమై గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలో మీటర్ల మేర వాహనాలు నిలచిపోతుండటంతో గంటల తరబడి బస్సుల్లో ప్రయాణికులు కూర్చోలేక నడిచివస్తున్నారు. ప్రస్తుతం అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కొద్దిపాటిగా ఉన్న రోడ్డు ధ్వంసమై భారీ ఎత్తున గుంతలు పడ్డాయి. వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఏది గుంతో ఏది రోడ్డో తెలియక గుంతకల్లు వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలు స్తంభించి పోతున్నాయి. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం అర్‌అండ్‌బీ అధికారులు గుంతలలో కంకర పూడ్చినప్పటికి భారీ వాహనాలు ఇరుక్కుని నిలిచిపోయాయి. దీంతో గుంతకల్లు, అనంతపురం వైపు భారీ ఎత్తున వాహనాలు స్తంభించిపోయాయి. ఆ గుంతల రోడ్లలో యాక్సిల్ కట్ అయి లారీ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పోలీసులు దగ్గర ఉండి ఎక్స్‌కవేటర్ సహకారంతో వాటిని పైకి లాగి రోడ్డు పక్కకు తరలిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నాయని స్థానిక ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే, అర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మెగా లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



గుత్తిలో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి సాధుబాబు, ఉరవకొండలో న్యాయాధికారి దుర్గా కల్యాణి..

గుత్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టులో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి సాధుబాబు, సీనియర్ సివిల్ న్యాయాధికారి కాశీవిశ్వనాథచారి ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 225 కేసులు పరిష్కరించి కక్షిదారులకు రూ.87లక్షల మేరకు పరిహారం అందించారు. ఐదు యాక్సిడెంట్ కేసులు పరిష్కరించి బాధితులకు రూ. 43.50 లక్షలు పరిహారం అందించారు. అదే విధంగా ఎస్సీఎస్టీ కేసులు 130 పరిష్కరించి రూ.1.85 లక్షల జరిమానా విధించారు. బ్యాంకులకు సంబంధించి 40 పీఎల్‌సీ కేసులను పరిష్కరించి రూ.23.30 లక్షలు చెల్లించేలా తీర్పును ఇచ్చారు. కక్షిదారుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి కల్పించారు. కక్షిదారులకు న్యాయాధికారులు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీడీ రత్నం, ఏజీపీ ఫక్రుబాషా, న్యాయవాదులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహబుబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్ : పట్టణంలోని గుంతకల్లు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్‌ఆదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరవకొండ సివిల్ కోర్టు న్యాయాధికారి, ఇన్‌చార్జ్ ఎంఎల్ఎస్‌సీ చైర్‌పర్సన్ డి దుర్గా కల్యాణి మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను జాతీయ లోక్‌ఆదాలత్‌లో పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం 245 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో లోక్‌ఆదాలత్ సభ్యులు ఎండీ బాబాతాజుద్దీన్, నాగశేషు, సి.గోపాల్‌కృష్ణ, ఏపీపీ సుహాసిని, న్యాయవాదులు లక్ష్మీపతి, యూనుస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

● ఉరవకొండ : లోక్ అదాలత్ ద్వారా సత్వరమే న్యాయ పరిష్కారం లభిస్తుందని ఉరవకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి దుర్గా కల్యాణి పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా 101 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

నేమకల్లు ఆంజన్నకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు ఉదయం పూజ కార్యక్రమాలు ప్రారంభించారు. పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళ హారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● రాయదుర్గం రూరల్ : మండలంలోని వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అప్పులాపురం ఆంజనేయస్వామి దేవాలయం, మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయా దేవాలయాలలో పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వస్త్రాలంకరణ, ఆకుపూజ, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు.



నేమకల్లు, అప్పులాపురంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

చల్లా సుబ్బరాయుడు సేవలు ఎనలేనివి: ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి చల్లా సుబ్బరాయుడు తాడిపత్రి ప్రాంతానికి చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. చల్లా సుబ్బరాయుడు వర్ధంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక యల్లనూరు రోడ్డు సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆయన కుమార్తె అమృతవల్లితో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాడిపత్రి ప్రాంతంలో మొదటి మంత్రిగా చల్లా సుబ్బరాయుడు ప్రజలకు ఎనలేనిసేవలు అందించారని తెలిపారు. ప్రజల మనస్సుల్లో ఆయన స్థానం సుస్థిరంగా ఉంటుందని కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం పుట్లూరు మండలంలో ఉన్న డ్యాంకు సుబ్బరాయసాగర్ అని పేరు పెట్టారని తెలిపారు. నివాళులర్పించిన వారిలో జంబులపాడు సర్పంచ్ ప్రభాకర్‌నాయుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రాజశేఖర్‌నాయుడు, టీడీపీ నాయకులు చింబిలి ప్రసాద్‌నాయుడు, కులశేఖర్, సోమశేఖర్, ప్రసాద్‌నాయుడు, వెంకటనాయుడు, చల్లా సూరి, నరసింహులు పాల్గొన్నారు.

నెట్టికంటి సన్నిధిలో ఆరెకటిక కార్పొరేషన్ చైర్మన్



ప్రసాదాలను ఇస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆంధ్రప్రదేశ్ ఆరెకటిక కార్పొరేషన్ చైర్మన్ హెచ్. హరికృష్ణరావు శనివారం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు హరికృష్ణకు పూలమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట ఆరెకటిక ప్రముఖులు అశోక్, సుబ్రహ్మణ్యం, ఎం.భాస్కర్, లలిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కణేకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయిన శ్రీరాములు, శ్రీధర్‌ను శనివారం సన్మానించారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ-1 లక్ష్మణ్ణ హాజరై వారికి పూలమాలలు, శాలువలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



గుత్తిలో గంధం ఊరేగింపు

గుత్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తికోటపై వెలసిన హజరత్ సయ్యద్ షా సయ్యద్ బాషా అలీ ఖాద్రీ రహంతుల్లా అలైహి 678 ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శనివారం గంధం మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గంధాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా దర్గా వరకు తీసుకెళ్లి స్వామికి గంధ మహోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉరుసు ఉత్సవాలు, 14న జియారత్ నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు.

పైప్‌లైన్ లీకేజీ.. ఎగసి పడుతున్న నీరు



పైప్‌లైన్ లీకేజీతో ఎగజిమ్ముతున్న నీళ్లు

కణేకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక వేదావతి హగరిలో ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి పైప్‌లైన్ లీకేజీ కావడంతో తాగునీరు వృథా అయింది. శనివారం ఉదయం 11.30 ప్రాంతంలో పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరు ఒక్కసారిగా విరజిమ్మి వేదావతి హగరిలో ప్రవహించింది.

మందుబాబులకు అడ్డాగా సచివాలయ భవనం

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచిపోయిన సచివాలయాల భవనాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. గ్రామీణ ప్రాంతంలో సచివాలయం ద్వారా ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో వైసీపీ ప్రభుత్వం మండల వ్యాప్తంగా 14 పంచాయతీలలో ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ. 45 లక్షలు నిధులు మంజూరు చేసింది. కొన్ని చోట్ల భవన నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వడ్రవన్నూరు గ్రామ సమీపంలో సచివాలయ నిర్మాణం పనులు 80 శాతం పూర్తి చేశారు. అధికారం మారిపోవడంతో కాంట్రాక్టర్లు మిగిలిన పనులు చేయకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయింది. గ్రామంలో పాత భవనంలో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తూ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సచివాలయ నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో మందుబాబులకు గ్రామ సచివాలయ నిర్మాణం అడ్డాగా మారింది. సచివాలయ భవనంలో మందుబాబులతో పాటు అసాంఘిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సచివాలయం నిర్మాణ పనులను పూర్తి చేయించి ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సచివాలయ భవనంలో తాగి పడేసిన మద్యం ప్యాకెట్లు, బాటిల్

ఆపద్బాంధవుడిలా ఆదుకున్న లోకేశ్: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో చిక్కుకున్న తెలుగు వారి కోసం మంత్రి నారా లోకేశ్ ఆపద్బాంధవుడిలా ప్రతి ఒక్కరిని ఆదుకున్నాడని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కొనియాడారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంక్షోభ సమయంలో లోకేశ్ తక్షణమే స్పందించారని అన్నారు. రెండు రోజుల పాటు నిద్రాహారాలు మరిచి ఆర్టీజీఎస్ నుంచి పనిచేసి, ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకున్నారని వివరించారు. అహర్నిశలు శ్రమించి ప్రత్యేక విమానాల్లో తెలుగువారిని స్వస్థలాలకు తీసుకురావడంలో లోకేశ్ పాత్ర అమోఘమని అభినందించారు. ఆపద సమయంలో దేవుడిలా ఆదుకున్నాడని, తెలుగువాళ్లందరూ ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు యోగక్షేమాలు తెలుసుకుని అందరినీ కాపాడారని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

తాడిపత్రి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి సమస్యలను వివరించారు. సీపీఎస్ తోపాటు మరిన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15నెలలు గడిచినా నేటికి ఏ విధమైన చర్యలు చేపట్టడం లేదని, శాసనసభ సమావేశాల్లో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దుచేయాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని తదితర డిమాండ్లను వివరించారు. కార్యక్రమంలో నాయకులు డేనియల్, శ్రీవాత్సవరెడ్డి, జయచంద్ర, రాంకిషోర్, అంకాల్, రవికుమార్, ఉపేంద్ర పాల్గొన్నారు.

సబ్సిడీ బియ్యం స్వాధీనం

వజ్రకరూరు(ఉరవకొండ), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని గడేహోతూరు సమీపంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న సబ్సిడీ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. అనంతపురానికి చెందిన రాఘవేంద్ర, హసీనా, ఇల్లూరుకు చెందిన వలిబాషా, లత్తవరం తండాకు చెందిన వెంకటేష్‌నాయక్ ఆటోలో తరలిస్తున్న ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు. ఆటోతో పాటు బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్విచ్చింగ్ స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు

గుత్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 220 కేవీ స్విచ్చింగ్ స్టేషన్‌లో దాదాపు రూ. కోటి అంచనా వ్యయంతో ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పద్మనాభ పిళ్లై తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. స్విచ్చింగ్ స్టేషన్‌లో పాత బ్రేకర్లు, సీపీఎస్, సీవీపీఎస్, సీఅండ్‌ఆర్ ప్యానల్స్‌ను నూతనంగా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 15 నుంచి 19 వరకు గుత్తిఆర్ఎస్ ఫీడర్, ఆర్‌డీఎస్ లైన్ల క్లియరెన్సు తీసుకుంటామని వివరించారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా హిందీ దినోత్సవం



హిందీ వేడుకలను నిర్వహిస్తున్న విద్యార్థినులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కొనకొండ్ల రోడ్డులోని శ్రీవివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ.. సెప్టెంబరు 14ను హిందీ దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అనంతరం విద్యార్థులు హిందీభాష ఔన్నత్యాన్ని తెలిపే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఓంకార్, హెచ్ఎం నాగమణి, సీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆసుపత్రి సమస్యలను పరిష్కరించాలి



వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు సురేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్‌కు చేరిన యూరియా

యల్లనూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సహకార సంఘం సొసైటీకి 12 టన్నుల యూరియా వచ్చి చేరినట్లు వ్యవసాయాధికారి మధు తెలిపారు. రైతులకు సోమవారం పంపిణీ చేస్తామన్నారు. గత పంపిణీ సమయంలో క్యూలైన్‌లో నిల్చున్న వారికి టోకెన్లు ఇచ్చామని, మొదట టోకెన్లు ఉ న్నవారికి పంపిణీ చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గొందిపల్లికి చెందిన పద్మనాభరెడ్డి అనే వ్యక్తి బైక్‌పై రాయలచెరువు నుంచి తమ గ్రామానికి వస్తుండగా.. జక్కలచెరువు గ్రామశివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో పద్మనాభరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.